క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.15 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి తణుకు పాలంకి వాస్తవ్యుడు కాలే సాయిశ్రీ భావన శనివారం రూ.15 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతను శేషవస్త్రాలతో సత్కరించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడి ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామికి చామంతిపూలతో పూజలు చేశారు. ఏడు వారాలు స్వామి వారిని దర్శించుకోవాలనే నమ్మకం నేపథ్యంలో భక్తులతో ఆలయం పోటెత్తింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా బాలాజీ స్వామి కల్యాణం

మామిడికుదురు: ధర్మ ప్రచార వారోత్సవాల్లో భాగంగా మొగలికుదురు వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం బాలబాలాజీ స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ కల్యాణం ఘనంగా జరిగింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి కల్యాణోత్సవ క్రతువును వీక్షించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గూడపల్లిలో ధర్మ ప్రచార వారోత్సవం

మలికిపురం: ఏపీ దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానం పర్యవేక్షణలో గూడపల్లి పల్లవపాలెం అగ్నికుల క్షత్రియ పట్టాభిరామ రామాలయం వద్ద శనివారం ధర్మ ప్రచార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రామాలయం వద్ద దేవస్థానం ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యంలో స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, అర్చకుడు నాగ సీతారాం లక్ష్మీనృసింహునికి అభిషేకం, సహస్రనామార్చన నిర్వహించారు. తొలుత గ్రామ పొలిమేర నుంచి మంగళవాయిద్యాలతో స్వామితో నగర సంకీర్తన చేస్తూ ఆలయం వరకూ శోభా యాత్ర చేశారు. శోభా యాత్రలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అంతర్వేది దేవస్థానం ఏసీ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ఆలయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

14న ఉచిత కంటి వైద్య శిబిరం

పి.గన్నవరం: ముంగండ గ్రామంలోని మంత్రవాది ఇందిరాకుమారి స్మారక గ్రామీణ వైద్యాలయంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు హోమియో వైద్యుడు ఖండవిల్లి నాగేశ్వరరావు తెలిపారు. వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి సిబ్బంది కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని, ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

కొత్తపేట: 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈ నెల 14 నుంచి 20 వరకూ జరుగుతాయని స్థానిక ఉప గ్రంథాలయం అధికారి కుంచే సునీత తెలిపారు. ఈ నెల 14న మాజీ ప్రధాని నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే బాలల దినోత్సవంతో వారోత్సవాలు ప్రారంభమౌతాయన్నారు. 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వివిధ పోటీలు, 19న దిశ చట్టం మహిళా సాధికారతపై చర్చ, 20 వారోత్సవాల ముగింపు, పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కవులు, సాహితీవేత్తలు, విద్యార్థులు పాల్గొని వారోత్సవాలను జయప్రదం చేయాలని సునీత కోరారు.

తీరానికి కొట్టుకువచ్చిన మృతదేహం

సఖినేటిపల్లి: స్థానిక క్షత్రియ కల్యాణ మండప సమీప గోదావరి నదీ తీరానికి శనివారం గుర్తు తెలియని పురుషుని మృతదేహం కొట్టుకువచ్చింది. మృతదేహం నుంచి వెలువడుతున్న దుర్వాసనతో అవస్థలు పడుతున్నట్టు స్థానికులు తెలిపారు.

చేసిందే చెబుతూ.. ప్రజల ముందుకు..

- జోరుగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



కె.ముంజవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పార్టీ నాయకులు



అంతర్వేది దేవస్థానంలో డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్న నాయకులు

రాజోలు: రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయం ఖాయమని జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. శుక్రవారం చింతలపల్లి గ్రామ పంచాయతీ వద్ద వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వం ద్వారా అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా గ్రామంలో లబ్ధి పొందిన వివరాల బోర్డును ప్రదర్శించారు. జెడ్పీటీసీ శైలజ మాట్లాడుతూ సీఎం జగన్ డీబీటీ ద్వారా సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, గ్రామశాఖ అధ్యక్షుడు నల్లి నాగబాబు, పార్టీ నాయకులు మట్టా సురేష్, బందారు కాశీ, గుబ్బల మనోహర్, ఇంటిపల్లి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది దేవస్థానంలో..

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం శనివారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే (వై ఏపీ నీడ్స్ జగన్) డోర్ టూ డోర్ క్యాంపెయిన్ వైఎస్సార్ సీపీ శ్రేణులు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, పార్టీ నాయకుడు తాడి సహదేవ్ కలిసి ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సాధించిన అభివృద్ధి, విజయాలను తెలియజేశారు. అలాగే 2014లో చంద్రబాబు, 2019లో జగనన్న చేసిన వాగ్దానాలు వినిపించి, నెరవేర్చినవి, నెరవేరకపోయినవి వాటిపై టిక్‌లు నిర్ణయించారు. వీటితో పాటు ఏపీకి జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌లను పంపిణీ చేశారు. సచివాలయ కన్వీనర్, గృహసారథి, వలంటీర్లు పాల్గొన్నారు.

కె.ముంజవరంలో..

పి.గన్నవరం: మండలంలోని కె.ముంజవరంలో శనివారం ×ఏపీకి సీఎం జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, సొసైటీ చైర్మన్ కుంపట్ల గోవిందరావు, నాగాబత్తుల సూర్యనారాయణ, పప్పుల కర్ణ, నూకపెయ్యి రాజేంద్ర ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సఖినేటిపల్లి మొక్కతోటలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం సఖినేటిపల్లి మొక్కతోటలో స్థానిక సంఘం, యూత్ కలిసి ఏర్పాటు చేసిన డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అలాగే జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావు, రాజోలు మాజీ ఎమ్మెల్యే గొల్లపల్లి సూర్యారావులు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, ప్రముఖ దాత డి.శ్రీనురాజు, నల్లి విశ్వనాథం, ఏ.మధురాజు, మాజీ సర్పంచ్‌లు ఈద రవిరెడ్డి, సరెళ్ల విజయ్‌ప్రసాద్, స్థానిక యూత్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

అవినీతికి తావులేని పాలన



సఖినేటిపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక

సఖినేటిపల్లి: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా అవినీతికి తావులేకుండా పాలన సాగిస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం సఖినేటిపల్లిలో ఎమ్మెల్యే రాపాక, అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. సాంకేతిక కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ, ఏ ప్రభుత్వం చేయని విధంగా సంక్షేమ కార్యక్రమాలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ మండల ప్రెసిడెంట్ కుసుమ చంద్రశేఖర్, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లి ప్రేమానందం, ఎంపీటీసీ కొల్లాబత్తుల శుభాకర్, నాయకులు నల్లి సుధీర్, కుసుమ చింటూ, గెడ్డం అమ్ములు, రాపాక సూరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: తాగునీటి సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఆదుర్రు బాబానగర్‌లో రూ.37 లక్షలు జల్‌జీవన్ నిధులతో చేపట్టనున్న వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేశారు. పాశర్లపూడి బొమ్మిడిపాలెంలో రూ.75.57 లక్షలతో నిర్మించనున్న వాటర్ ట్యాంకుకు శంకుస్థాపన చేశారు. పెదపట్నం లంక సత్తెమ్మపేటలో రూ.20.82 లక్షలతో నిర్మిచనున్న వాటర్ ట్యాంకు పనులకు శంకుస్థాపన చేశారు. పెదపట్నంలంక గెడ్డంవారిపేట, సత్తెమ్మపేటలో గడప గడపకు నిధులతో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ రోడ్లను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాస్, కొనుకు ప్రేమజ్యోతి, సుందరనీడి చిన్ని, ఎంపీటీసీలు గెద్దం మహాలక్ష్మమ్మ, నెల్లి దుర్గాప్రసాద్, అంకాడి వీరాంజనేయులు, కొమ్ముల జంగమయ్య, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, పార్టీ నేతలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కృష్ణకార్తిక్ ఎంపిక



ముప్పర్తి కృష్ణకార్తిక్

మలికిపురం: ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ విశాఖపట్నం స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 బాలుర విభాగం షటిల్ బ్యాడ్మింటన్ జాతీయ స్థాయి పోటీలకు జరిగిన ఎంపిక పోటీల్లో మలికిపురం భాష్యం స్కూల్ విద్యార్థి ముప్పర్తి కృష్ణ కార్తీక్ రెండో స్థానం సాధించాడు. దీంతో కార్తీక్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ టీంకు నాయకత్వం వహించి, టీంకు రజత పతకం సాధించాడు. కార్తిక్‌ను ప్రిన్సిపాల్, శ్రీరామ బ్యాడ్మింటన్ అధ్యక్షుడు దెందుకూరి రాంబాబురాజు, ప్రగతి ఫ్రెండ్స్ షటిల్ క్లబ్ సభ్యులు అభినందించారు.

కూలీల కోసం పని చేయడం అభినందనీయం



వ్యవసాయ కూలీ సంక్షేమ సంఘం సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంఘ సభ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. శనివారం రావులపాలెంలో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయు) ప్రథమ మహా సభలకు ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా గ్రామీణ ప్రాంతాల్లో జీవిస్తున్న వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సంఘ సభ్యులందరినీ పేరుపేరునా అభినందించారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించిన తాపీ మేస్త్రీల సంక్షేమ సంఘం భవనాన్ని 2004లో ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ గ్రాంట్ నుంచి నిర్మించిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. సమావేశంలో చాంబర్ అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీకి రూ.1.55 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి శనివారం వివిధ సేవల ద్వారా రూ.1.55 లక్షలు ఆదాయం వచ్చింది. స్వామివారి దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు వచ్చారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టికెట్ల విక్రయం ద్వారా రూ.1.10 లక్షలు వచ్చింది. నిత్యాన్నదానం ట్రస్ట్‌కు భక్తులు రూ.44,711 విరాళంగా అందించారు. స్వామిని 2,695 మంది భక్తులు దర్శించుకున్నారు. 2,073 మంది స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రూ.30 వేల ఆర్థిక సాయం



కొమరాడలో ఆర్థికసాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1980–81 విద్యా సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు శనివారం మూడు పేద కుటుంబాలకు రూ.10 వేలు వంతున రూ.30 వేల ఆర్థికసాయం అందించారు. కొమరాడ, కడలిలోని తూర్పుపాలెం, అమలాపురం సమీపాన ఇందుపల్లికి చెందిన ముగ్గురు నిరుపేద కుటుంబాలకు ఈ సహాయం అందించారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



అప్పనరామునిలంక క్రీస్తు దేవాలయం వద్ద సమావేశంలో పాల్గొన్న దైవ సేవకులు

సఖినేటిపల్లి: క్రైస్తవుల అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని కోనసీమ జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు కనపాల బాబూరావు అన్నారు. శనివారం అప్పనరామునిలంక కల్వరి క్రీస్తు దేవాలయం వద్ద మండల క్రిస్టియన్ మైనార్టీ సెల్ సమావేశం అధ్యక్షుడు జిల్లెళ్ల రాజు అధ్యక్షతన జరిగింది. జిల్లా అధ్యక్షుడు బాబూరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సీఎం జగన్ క్రైస్తవులకు అనేక పథకాలు అమలు పర్చి, చర్చిల నిర్మాణాలకు తగిన సహకారం అందజేస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. కాగా ఈ నెల 28న జరిగే దైవ సేవకుల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఆయన కోరారు. జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి రెవ.ఎస్.ప్రసాదరావు, మండల ఏఎంసీ చైర్మన్ నల్లి శివకుమార్, దైవ సేవకులు బుంగ వరప్రసాద్, గెడ్డం జాన్సన్, రాపాక మోహన్‌రావు, జీవీ ప్రసాద్, జి.ఆనందజ్యోతి, ఎన్.రాజు పాల్గొన్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలని యాత్ర



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలుసుకున్న జయకుమార్

రావులపాలెం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ జగనన్న రాష్ట్ర అభిమాన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కావూరి జయకుమార్ 100 రోజుల ప్రజాచైతన్య యాత్రను చేపట్టారు. ఈ యాత్ర శనివారం రాత్రి రావులపాలెం చేరుకుంది. మండలంలోని గోపాలపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని కలసి జయకుమార్ యాత్ర విషయాలను తెలియజేశారు. సెప్టెంబర్ 12న ఈ కార్యక్రమాన్ని ప్రారంభించానని, నేటితో 60 రోజులు పూర్తయ్యాయన్నారు. ఇప్పటి వరకు 15 జిల్లాల్లో చైతన్యయాత్రను ముగించుకుని 16వ జిల్లాగా కోనసీమ జిల్లా చేరినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పదవులను నుంచి క్యాబినెట్ పదవుల వరకూ సింహ భాగం జగనన్న పాలనలోనే ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్రం లోని 175 నియోజకవర్గాల్లో విజయఢంకా మోగిస్తుందని ఆకాంక్షించారు.

ఆనంద కాంతుల దీపావళి

- నేడే ఇంటింటా దీపాల పండుగ
- డివిజన్‌లో 4 బాణసంచా తయారీ కేంద్రాలు, 5 హోల్‌సేల్, 139 రిటైల్ షాపులు
- ముమ్మరంగా క్రయ, విక్రయాలు



కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాణసంచా దుకాణాల సముదాయం

కొత్తపేట: బాలలు, యువతీ, యువకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే దీపావళి పండగ వచ్చేసింది. హిందువుల ఇంట దీపావళి రోజున సాయంత్రం లక్ష్మీదేవి పూజ నిర్వహిస్తారు. చీకటి పడుతుందనగానే ఇంటి గుమ్మాలకు ఇరువైపులా, ప్రహరీలు, భవనాల పిట్టగోడలపై దీపాలు వెలిగిస్తారు. అనంతరం ప్రధాన ఘట్టమైన బాణసంచా కాల్పులు ప్రారంభిస్తారు. ఈ పండగను పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం తమ ఆర్థిక స్తోమతకు అనుగుణంగా బాణసంచా కొనుగోలు చేసి కాల్చడం ద్వారా పండగ జరుపుకొంటారు.

కళాశాలల గ్రౌండ్స్‌లో బాణసంచా దుకాణాలు

జనావాసాల మధ్య, రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ బాణసంచా విక్రయాలు సాగించకుండా అన్ని జాగ్రత్తల నడుమ నివాసాలకు దూరంగా, షాపులన్నీ ఒకే చోట కళాశాలల గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేశారు. కొత్తపేట రెవెన్యూ డివిజన్‌లో 4 తయారీ కేంద్రాలు, 5 హోల్‌సేల్ షాపులు, 139 తాత్కాలిక లైసెన్స్ (రిటైల్) షాపులు వున్నాయి. ఆ విధంగా కొత్తపేట మండలంలో 4 తయారీ కేంద్రాలు, రిటైల్ బాణసంచా షాపులు కొత్తపేట మండలంలో 25, రావులపాలెం మండలంలో 36, ఆత్రేయపురం మండలంలో 21, ఆలమూరు మండలంలో 13తో పాటు అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో సుమారు 45 షాపులు వున్నాయి. హోల్‌సేల్ షాపులు గత 20 రోజుల నుంచి విక్రయాలు సాగిస్తుండగా రిటైల్ షాపుల్లో విక్రయాలకు మూడు రోజులు అనుమతి ఇచ్చారు. దాంతో శుక్రవారం కొందరు, శనివారం కొందరు తమకు నిర్దేశించిన ప్రదేశాల్లో షాపులు ఏర్పాట్లు చేసుకుని విక్రయాలు ప్రారంభించారు.

అధికారులతో కలసి ఆర్డీవో తనిఖీలు

దీపావళి బాణసంచా హోల్‌సేల్, రిటైల్ షాపుల వద్ద నియమ, నిబంధనలు విధిగా పాటించాలని ఆర్డీవో ఎం.ముక్కంటి, డీఎస్పీ కేవీ రమణ సూచించారు. ఆ మేరకు మండల స్థాయి అధికారులతో కలసి పలు హోల్‌సేల్, తయారీ కేంద్రాలు తనిఖీ చేశారు. అలాగే ఆయన ఆదేశాల మేరకు మండలాల్లో తహసీల్దార్‌లు, ఎస్ఎఫ్ఓలు, ఎస్సైలు ప్రతి రోజు సంయుక్త తనిఖీలు జరిపారు.

దీపావళి జాగ్రత్తలు

బాణసంచాను పిల్లలు, పెద్దల పర్యవేక్షణలో మాత్రమే కాల్చాలి. టపాకాయలు కాల్చేటప్పుడు నూలు (కాటన్) దుస్తులనే ధరించాలి. విశాలమైన ప్రదేశం చూసుకుని బాణసంచా కాల్చాలి. టపాకాయలను కాల్చడానికి కొవ్వు వత్తిని గాని అగరబత్తిని గాని మాత్రమే ఉపయోగించాలి. బాణసంచా కాల్చేటప్పుడు బకెట్‌తో నీటిని ఆ సమీపంలో వుంచుకోవాలి. సెర్చిలైట్లు, చిచ్చుబుడ్లు, టపాకాయలను చేతిలో పెట్టుకుని కాల్చకూడదు. టపాకాయలను భూమి మీద వుంచి కాల్చి దూరంగా వెళ్లాలి. పేలని టపాకాయలను మరలా వెలిగించే ప్రయత్నం చేయకుండా నీటితో తడిపేసి పారవేయాలి. 3 ఏళ్ల లోపు పిల్లలను, వృద్ధులను టపాకాయల శబ్దానికి, బాణసంచా పొగకు దూరంగా వుంచాలి.

దీపావళి పండుగలో జాగ్రత్త వహించాలి

ఆలమూరు/అంబాజీపేట/ఆత్రేయపురం: దీపావళి పండుగలో బాణసంచా కాల్చేటప్పుడు తగు జాగ్రత్తలు వహించాలని ఆలమూరు, అంబాజీపేట, ఆత్రేయపురం ఎస్సైలు ఎల్.శ్రీనునాయక్, ఎ.చైతన్యకుమార్, బీవై కిరణ్‌కుమార్ సూచించారు. వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో పెట్టుకుని పెద్ద శబ్దాలు వచ్చే పటాసులను ఎదుటివారికి ఇబ్బంది కలగకుండా కాల్చాలన్నారు. అలాగే జనసంచారం ఎక్కువ ఉన్న ప్రదేశాలు, రహదారులు, వీధుల వెంబడి యువత ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ టపాసులు కాలిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

వెలవెలబోయిన దుకాణాలు

అంబాజీపేట: పెరిగిన ధరల ప్రభావంతో దీపావళి బాణసంచా షాపులు వెలవెలబోయాయి. మండలంలోను, గ్రామాల్లోను అంతంత మాత్రంగానే దీపావళి దుకాణాలను వ్యాపారులు వేశారు. గతంలో దీపావళి వస్తుందంటే వారం రోజులు ముందుగా హోల్‌సేల్ రిటైల్ షాపుల నిర్వాహకులు అమ్మకాలు ప్రారంభించేవారు. అయితే ఈ ఏడాది అధిక ధరలకు తోడు, నిబంధనలు కష్టతరమవడంతో గ్రామాల్లో దుకాణాల సందడి కనబడలేదు. బాణసంచా విక్రయదారులు శనివారం దీపావళి సామగ్రి దుకాణాలు ఏర్పాటు చేశారు. సాయంకాలం అయినప్పటికీ బాణసంచా దుకాణాల వద్ద అంతంత మాత్రంగానే అమ్మకాలు సాగా యి.

నిబంధనలు, జాగ్రత్తలు పాటించాలి

దీపావళి పర్వదినం సందర్భంగా బాణసంచా క్రయ, విక్రయదారులు నియమ నిబంధనలు విధిగా పాటించేలా తగు చర్యలు తీసుకున్నాం. బాణసంచా కాల్చేవారు విధిగా పై నియమాలు పాటించాలి. దీపావళి దీపాల వలన గాని, బాణసంచా కాల్చేటప్పుడు గాని ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే కొత్తపేట అగ్నిమాపక కేంద్రానికి 08855 243299 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించండి.

– పి.శ్రీనివాస్, అగ్నిమాపక అధికారి, కొత్తపేట